నేటి నుంచి పాతగుట్ట వార్షిక బ్రహ్మోత్సవాలు

స్వామివారిని తిరువీధుల్లో ఊరేగిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 6 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రానికి అనుబంధ ఆలయంగా కొనసాగుతున్న పాతగుట్ట (పూర్వ గిరి) లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో 2025 వార్షిక బ్రహ్మోత్సవాలకు శుక్రవారం శ్రీకారం చుట్టనున్నారు. ఈ నెల 13వరకు నిర్వహించనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆలయ ఈఓ భాస్కర్‌రావు, డీఈఓ దోర్భల భాస్కర్‌శర్మ తెలిపారు. ఈ నెల 9న ఎదుర్కోలు, 10న స్వామివారి తిరు కల్యాణోత్సవం, 11న దివ్య విమాన రథోత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. 13న స్వామివారి అష్టోత్తర శత ఘటాభిషేకంతో ఉత్సవాలు ముగియనున్నట్లు వెల్లడించారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా 9, 10, 11 తేదీల్లో వాహన సేవలు నిర్వహించనున్నారు. శత ఘటాభిషేకంలో పాల్గొనేవారు రూ.250 చెల్లించాల్సి ఉంటుందని, ఒక టికెట్‌పై ఇద్దరికి మాత్రమే ప్రవేశం ఉంటుందని వారు వెల్లడించారు.

అధ్యయనోత్సవాలు పరిపూర్ణం

పాతగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈ నెల 3న ప్రారంభమైన అధ్యయనోత్సవాలు గురువారం ముగిశాయి. పాతగుట్ట ప్రధానాలయంలో నిత్యారాధనల అనంతరం లక్ష్మీనరసింహస్వామిని అలకంరించి ఆళ్వారాధుల ముందు ప్రబంధ పారాయణాలను పఠించి, తిరువీధుల్లో ఊరేగించారు. ఉత్సవమూర్తులకు తిరుమంజన, నవకలశ స్నపన మహోత్సవం జరిపారు. ఇరామానుజ సుత్తందారి ఉపదేశ రత్తిన మాలై అనుసంధానం గావించి అధ్యయనోత్సవాలకు పరిసమాప్తి పలికారు.

పోచంపల్లిని సందర్శించిన అధికారుల బృందం

చేనేత సహకార సంఘంలో ఇక్కత్ వస్త్రాలను పరిశీలిస్తున్న అధికారులు

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 6 : నేషనల్ కో ఆపరేటివ్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్‌సీయూఐ), పూణేలోని ఇంటర్నేషనల్ కో ఆపరేషన్ అండ్ ట్రైనింగ్ ఇన్ అగ్రికల్చర్ బ్యాంకింగ్ (సీఐసీటీఏబీ) సహకారంతో 30 మంది అధికారుల బృందం గురువారం భూదాన్ పోచంపల్లిని సందర్శించింది. వారు చేనేత సహకార సంఘం, టూరిజం సెంటర్‌లో పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలను పరిశీలించారు. భూదానోద్యమానికి సంబంధించిన చిత్రాలను తిలకించారు. చేనేత మగ్గాలపై తయారవుతున్న వస్త్రాలను చూసి వారి కళా నైపుణ్యాన్ని ప్రశంసించారు. పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలు ఖండాంతర ఖ్యాతి గాంచాయని, సాంప్రదాయ చేనేత వస్త్రాలకు మంచి ఆదరణ లభిస్తుందని పేర్కొన్నారు. ఈ బృందంలో నేపాల్‌తో పాటు భారతదేశంలోని అధికారులు ఉన్నారు. ఈ బృందానికి కొండూరు రవీందర్‌రావు మార్గదర్శనం చేశారు.

స్థానిక సంస్థల్లో లబ్ధి కోసమే ఎస్సీ వర్గీకరణ బిల్లు

- మాల సంఘాల జేఏసీ రాష్ట్ర నాయకుడు శేపూరి నర్సింహ

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శేపూరి నర్సింహ

చౌటుప్పల్, ఫిబ్రవరి 6 : స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో హడావిడిగా ప్రవేశపెట్టారని మాల సంఘాల జేఏసీ రాష్ట్ర నాయకుడు శేపూరి నర్సింహ అన్నారు. పట్టణంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇలా చేస్తే 2004లో తన గురువు చంద్రబాబుకు పట్టిన గతే సీఎం రేవంత్‌రెడ్డికి పడుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో మాలల సత్తా చూపిస్తామని హెచ్చరించారు. ఎస్సీ ఉపకులాలు, అభ్యుదయ సంఘాలు, మేధావుల అభిప్రాయాలను తీసుకోకుండా బిల్లు పెట్టడం సరైంది కాదన్నారు. 2011 ప్రకారం వర్గీకరణ చేయడం సమంజసం కాదని, రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ ఎస్సీ వర్గీకరణ చేయడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ బిల్లును తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో సాతిరి రమేశ్, ఆవుల గణేశ్, ఎనమల నగేశ్, కట్ట శంకర్, సత్యం, భాస్కర్, హరినాథ్ పాల్గొన్నారు.

పేదల కడుపు కొట్టేలా కేంద్ర బడ్జెట్ : సీపీఎం

పాలడుగులో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

మోత్కూరు, ఫిబ్రవరి 6 : కేంద్రం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ పేదల కడుపు కొట్టి సంపన్నులకు దోచిపెట్టే విధంగా ఉందని సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు అన్నారు. మండలంలోని పాలడుగు గ్రామంలో గురువారం కేంద్ర బడ్జెట్‌పై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ కార్మికులకు, కర్షకులకు, మహిళలకు, సామాన్య ప్రజలకు వ్యతిరేకంగా సంపన్న వర్గాలు, పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తులకు మేలు చేసే విధంగా ఉందన్నారు. ప్రజలకు కొనుగోలు శక్తిని పెంచే ప్రతిపాదన కానీ, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించి సామాన్య ప్రజలకు లాభం చేకూర్చేలా ఏ ఒక్క అంశమూ లేదని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు దడిపల్లి ప్రభాకర్, కొంపెల్లి ముత్తమ్మ, పిట్టల చంద్రయ్య, గంగయ్య, సోమరాజు, ఉప్పలయ్య పాల్గొన్నారు.

రామసముద్రం చెరువులో చెలరేగిన మంటలు

- ఆర్పిన అగ్నిమాపక సిబ్బంది

మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

గుండాల, ఫిబ్రవరి 6 : మండల కేంద్రంలోని రామసముద్రం చెరువులో మంటలు చెలరేగి చెట్లు కాలిపోయాయి. గుండాల గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డంపింగ్ యార్డులో చెత్తకు నిప్పు పెట్టగా మంటలు తీవ్రమై నీళ్లు లేని పక్కనే ఉన్న రామసముద్రం చెరువులోని చెట్లకు అంటుకున్నాయి. సమీపంలో ఉన్న రైతులు అప్రమత్తమై మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

కుంకుడుపాముల వాసికి డాక్టరేట్

నిమ్మరెడ్డి రాజశేఖర్‌రెడ్డి

రామన్నపేట, ఫిబ్రవరి 6 : మండలంలోని కుంకుడుపాముల గ్రామానికి చెందిన నిమ్మరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఆంధ్రా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. డాక్టర్ ఎల్ కృష్ణకాంత్‌రెడ్డి, డాక్టర్ హిమబిందు పర్యవేక్షణలో రసాయన శాస్త్రంలో 'టోటల్ సింథసిస్ ఆఫ్ లాక్టోస్ కంటైనింగ్ నేచురల్ ప్రొడక్ట్స్ సుమాల్యాక్టిన్ ఏ పాండన్‌గోలైడ్1 అండ్ వట్టరీలైడ్ ఏ' అనే క్యాన్సర్ పరిశోధనకు గాను డాక్టరేట్ పట్టా లభించింది. ప్రస్తుతం ఆయన అరజెన్‌లైఫ్ సైన్సెస్ లిమిటెడ్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. డాక్టరేట్ పొందిన ఆయనను కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

రాజాపేట ఎస్ఐ అనిల్‌కుమార్‌కు సన్మానం

రాజాపేట, ఫిబ్రవరి 6 : ఎస్ఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన అనిల్‌కుమార్‌ను బీఆర్ఎస్ మండల నాయకులు గురువారం సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు మరల నాగరాజు, ఇప్ప సిద్ధులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి : కలెక్టర్

- కలెక్టర్ హనుమంతరావు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 6 : విద్యార్థుల ఆరోగ్యానికి సమగ్ర చర్యలు చేపట్టాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం రాష్ట్రీయ బాల స్వస్థత కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల రక్తహీనతపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. ప్రతి పాఠశాలలో హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి, పలు రకాల పరీక్షలకు సంబంధించిన రిజిష్టర్లను తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ మనోహర్, జిల్లా ఆరోగ్య శాఖ అధికారులు, ఆర్‌బీఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

తలుపు తట్టి.. నిద్రలేపి

- 'పబి' విద్యార్థుల అభ్యాసాలను పరిశీలించిన అధికారులు

ఆలేరు రూరల్ : కొల్లూరులో విద్యార్థి ఇంటి వద్ద అభ్యాసాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

ఆలేరు రూరల్, ఫిబ్రవరి 6 : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం జిల్లాలో పలు చోట్ల విద్యార్థుల ఇంటికి వెళ్లి తలుపు తట్టి నిద్ర లేపారు. విద్యార్థుల బోధనా అభ్యాసాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఇందులో భాగంగా అదనపు కలెక్టర్ వీరారెడ్డి ఆలేరు మండలంలోని కొల్లూరులో ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థుల ఇండ్లకు వెళ్లి బోధనా అభ్యాసాలను పరిశీలించారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించేందుకు పలు సూచనలు చేశారు.

యాదగిరిగుట్ట : పట్టణంతోపాటు ఆయా గ్రామాల్లో గురువారం తెల్లవారుజామున 5గంటలకు అధికారులు పదో తరగతి విద్యార్థుల ఇండ్లకు వెళ్లి తలుపు తట్టి నిద్రలేపారు. సీ గ్రేడ్ విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసి వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సబిత, బాలికల హాస్టల్ వార్డెన్ సోనీ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిర్మల, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు సబీరాబేగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలోని విద్యార్థుల ఇండ్లకు మండల ప్రత్యేకాధికారి రాజారాం, తాసీల్దార్ రవికుమార్, ఎంఈఓ మహదేవరెడ్డి వెళ్లి అభ్యాసాన్ని పరిశీలించారు.

మోటకొండూర్ : మండల కేంద్రానికి చెందిన పదో తరగతి విద్యార్థి ఇర్ఫాన్ ఇంటికి ఎంపీడీఓ ఇందిర వెళ్లి పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. ఆమె వెంట ఉపాధ్యాయులు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

వలిగొండ : మండలంలోని మల్లేపల్లి గ్రామానికి చెందిన విద్యార్థులు ఎర్ర ఉపేందర్, ఉమాచందర్ ఇండ్లకు తాసీల్దార్ పి.శ్రీనివాస్‌రెడ్డి, మండల కేంద్రంలోని కోనేటి శివరామరాజు ఇంటికి ఎంపీడీఓ జితేందర్‌రెడ్డి, నాగారం గ్రామానికి చెందిన గోళ్ల కార్తిక్ ఇంటికి ఎంఈఓ సుంకోజు భాస్కర్ ఉపాధ్యాయులతో కలిసి వెళ్లి పలు సూచనలు చేశారు.

రామన్నపేట : మండల కేంద్రంలోని పలువురి విద్యార్థుల ఇండ్లకు ఎంపీడీఓ యాకూబ్ నాయక్, ఎంఈఓ జి.జ్యోతి వెళ్లి విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. ఫస్ట్ ర్యాంక్ సాధించిన విద్యార్థులకు రూ.5వేల నగదు ప్రోత్సాహకం అందజేస్తామని తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మెండి చెయ్యి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జహంగీర్

సమావేశంలో మాట్లాడుతున్న ఎండీ జహంగీర్

చౌటుప్పల్, ఫిబ్రవరి 6 : కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి మెండి చెయ్యి చూపిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ జహంగీర్ అన్నారు. చౌటుప్పల్‌లో గురువారం ఏర్పాటు చేసిన ఆ పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఇద్దరు కేంద్ర మంత్రులు, ఆరుగురు బీజేపీ ఎంపీలు ఉన్నా నిధులు రాబట్టడంలో విఫలమయ్యారన్నారు. మూసీ పునరుజ్జీవ, గోదావరి జలాల అనుసంధానం కోసం నయా పైసా ఇవ్వలేదని మండిపడ్డారు. సామాన్యులకు కాకుండా సంపన్నులకు పెద్ద పీట వేశారని విమర్శించారు. సమావేశంలో సీపీఎం నాయకులు బూర్గు కృష్ణారెడ్డి, గంగాదేవి సైదులు, రాగీరు కిష్టయ్య, తడక మోహన్, చీరిక సంజీవరెడ్డి, బోయ యాదయ్య, చింతల సుదర్శన్, పల్లె మధుకృష్ణ, నందీశ్వర్, శ్రీశైలం పాల్గొన్నారు.

'10న మహా ధర్నాను జయప్రదం చేయాలి'

మహిళలకు సంఘం సభ్యత్వం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 6 : హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద ఈ నెల 10న నిర్వహించే మహాధర్నాలో వ్యవసాయ, ఉపాధి హామీ కూలీలు, వృత్తిదారులు పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పల్లెర్ల అంజయ్య అన్నారు. మండలంలోని నందనం గ్రామంలో గురువారం వ్యవసాయ కూలీల స్థితిగతులను అధ్యయనం చేస్తూ సంఘం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి ఏటేటా నిధులు తగ్గిస్తూ పథకాన్ని ఎత్తివేయాలని కుట్ర చేస్తుందన్నారు. ఉపాధి హామీకి బడ్జెట్‌లో రూ.2లక్షల కోట్లు కేటాయించాల్సి ఉండగా, 86వేల కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించడం దారుణమని పేర్కొన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పునరాలోచించి ఉపాధి హామీకి, సామాజిక అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై అన్ని వర్గాల ప్రజలు తిరుగుబాటు చేయాలని పిలుపునిచ్చారు. మహాధర్నాకు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కొండపురం యాదగిరి, కె.ఆంధ్రయ్య, కె.నర్సింహ, కె.స్వామి, పెద్దమ్మ, సునంద, మైసమ్మ, రేణుక, లక్ష్మమ్మ, చంద్రమ్మ, సావిత్రి, సంతోష పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి : సీపీఎం

బ్రిడ్జి వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 6 : మండలంలోని శివారెడ్డిగూడెం నుంచి దంతూరు, వంకమామిడి గ్రామాలకు వెళ్లే దారిలో చిన్న ఏటి వద్ద బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. బ్రిడ్జి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని డిమాండ్ చేస్తూ శివారెడ్డిగూడెం గ్రామ శివారులోని ఏటి వద్ద గురువారం సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022లో పనులు ప్రారంభించినా ఇప్పటి వరకు పిల్లర్లను కూడా పూర్తిస్థాయిలో నిర్మాణం చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి బ్రిడ్జి పనులను వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి దుబ్బాక జగన్, నాయకులు మధు, కృష్ణారెడ్డి, మల్లారెడ్డి, లక్ష్మయ్య, వీరారెడ్డి, జనార్దన్ రెడ్డి, అలీ, యాదిరెడ్డి, లక్ష్మీనరసింహారెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

చౌటుప్పల్, ఫిబ్రవరి 6 : జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లిలో గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం.. తంగడపల్లికి చెందిన గాదె వెంకటేశ్ (36) సెంట్రింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా తాగుడుకు బానిసైన ఆయన భార్యతో గొడవపడేవాడు. దాంతో ఆమె తన కూతురిని తీసుకొని పుట్టింటికి వెళ్లడంతో ఇంట్లో వెంకటేశ్ ఒక్కడే ఉంటున్నాడు. కాగా, గురువారం ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండడంతో చుట్టుపక్కల వారు వెళ్లి చూడగా దూలానికి చీరెతో ఉరి వేసుకొని ఉన్న వెంకటేశ్ కుళ్లిపోయిన మృతదేహం కనిపించింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు వచ్చి మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మూడ్రోజుల క్రితం మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.యాదగిరి తెలిపారు.

యువతి ఆత్మహత్య

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 6 : మండలంలోని జూలూరు గ్రామానికి చెందిన ఓ యువతి హైదరాబాద్‌లో ఆత్మహత్యకు పాల్పడింది. యువతి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. జూలూరు గ్రామానికి చెందిన దాసరి గౌతమి (26) హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ హాస్టల్‌లో ఉంటుంది. కాగా, బుధవారం గౌతమి హైదరాబాద్‌లో ఉంటున్న తన బాబాయ్ ఇంటికి వెళ్లగా.. ఇంటికి తాళం వేసి ఉండడంతో పిన్ని దాసరి జ్ఞానితకు ఫోన్ చేసింది. తాను దవాఖానకు వెళ్లానని, పక్కన తాళం చెవి ఉంది తీసుకోమని జ్ఞానిత చెప్పింది. తాళం చెవి తీసుకొని ఇంట్లోకి వెళ్లిన గౌతమి చీరెతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. బుధవారం సాయంత్రం జ్ఞానిత కుమారుడు ఇంటికి రాగా, ఉరికి వేలాడుతూ కనిపించడంతో వెంటనే ఇరుగుపొరుగు వారికి చెప్పాడు. స్థానికులు వచ్చి చూసి జ్ఞానితకు ఫోన్ చేశారు. జ్ఞానిత వచ్చి గౌతమి తల్లిదండ్రులకు విషయం చెప్పింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు. అనంతరం మృతదేహాన్ని జూలూరు గ్రామానికి తీసుకొచ్చారు. ఆమె ఆత్మహత్యకు ప్రేమ వివాహం కారణమని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

క్వారీ గుంతలో పడి వ్యక్తి మృతి

బొమ్మలరామారం, ఫిబ్రవరి 6 : ప్రమాదవశాత్తు క్వారీ గుంతలో పడి వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని రామలింగంపల్లి గ్రామంలో బుధవారం తెల్లవారుజామున జరిగింది. గురువారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామలింగంపల్లి గ్రామంలోని స్టార్ రాక్ క్రషర్ వద్ద మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సిబ్బుసింగ్ (23) తన బంధువులతో కలిసి రోజువారీ కూలీగా రాక్ డ్రిల్లింగ్ పని చేస్తున్నాడు. బుధవారం తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్లే క్రమంలో కాలి జారి పక్కనే ఉన్న లోతైన క్వారీ గుంతలో పడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి సోదరుడు సోహన్‌లాల్ సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీశైలం తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ట్రాన్స్‌ఫార్మర్ నుంచి రాగి తీగ చోరీ

తుర్కపల్లి, ఫిబ్రవరి 6 : మండలంలోని వెంకటాపురం గ్రామంలోని వ్యవసాయ బావుల వద్ద గల ట్రాన్స్‌ఫార్మర్ నుంచి బుధవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు కాపర్ వైరు దొంగిలించారు. ఈ గ్రామంలో తరచూ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి వైరు చోరీ జరుగుతుందని, దాంతో పొలాలు ఎండిపోయే పరిస్థితులు వస్తున్నాయని రైతులు పేర్కొంటున్నారు. పోలీసులు నిఘా ఏర్పాటు చేసి దొంగలను పట్టుకోవాలని కోరారు.

వైరు చోరీ అయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న రైతులు

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మాధవీలత

భోజనాన్ని పరిశీలిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మాధవీలత

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 6 : విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వి.మాధవీలత అన్నారు. మండలంలోని అనంతారం గ్రామ పరిధిలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో విద్యార్థులకు గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు బాలల హక్కులు, లీగల్ సర్వీసెస్ యూనిట్, మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్ఫలితాలు, సంబంధిత చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాలలో వసతులు, భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దేవుడి భూమిని కాపాడాలని ఎమ్మెల్యేకు వినతి

ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఇంద్రియాల గ్రామ నాయకులు

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 6 : మండలంలోని ఇంద్రియాల గ్రామం రాజగోపాల స్వామి దేవస్థాన భూమిని కొందరు తప్పుడు పత్రాలు సృష్టించి కబ్జాకు పాల్పడుతున్నారని, ఆ భూమిని కాపాడాలని దేవస్థాన కమిటీ చైర్మన్ చింతల రామకృష్ణ, నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. దేవుడి భూమిని సర్వే అయ్యే వరకు సాగు చేయకుండా నిలిపివేయాలన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో గ్రామ మాజీ సర్పంచులు బండి కృష్ణగౌడ్, టింగిల్‌కార్ వెంకటేశ్, నాయకులు పానుగంటి లింగస్వామి, భీమగోని రాజారాం, బద్దం రాజేశ్వర్, ఎర్ర లక్ష్మణ్, చింతల ఉపేందర్, దొడ్డి సుధాకర్, గరిసె మురళి పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో జడ్పీ సీఈఓ ఆకస్మిక తనిఖీ

మండల పరిషత్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈఓ శోభారాణి

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 6 : మండల పరిషత్ కార్యాలయాన్ని జిల్లా పరిషత్ సీఈఓ ఎన్.శోభారాణి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. 2022-23, 2023-24 సంవత్సరం వార్షిక రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండల అభివృద్ధి కోసం అధికారులు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాపర్తి భాస్కర్‌గౌడ్, పర్యవేక్షకులు ఏపాల సత్యనారాయణరెడ్డి, జడ్పీ కార్యాలయ పర్యవేక్షకులు సుధాకర్ చారి, అపర్ణ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

ఉపాధి హామీ కూలీలలో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ నాగిరెడ్డి

గుండాల, ఫిబ్రవరి 6 : మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను డీఆర్‌డీఓ నాగిరెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడారు. పనికి తగ్గ వేతనం గురించి వివరించారు. నర్సరీని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఆయన వెంట ఎంపీడీఓ దేవేందర్‌రావు, ఏపీఓ ఇమ్మాన్యుయేల్, టీఏలు పల్లవి, మత్స్యగిరి, పంచాయతీ కార్యదర్శి సోఫియా, ఫీల్డ్ అసిస్టెంట్ ఐలయ్య ఉన్నారు.

హెల్త్ సబ్ సెంటర్‌లో డ్రోన్ సేవలు ప్రారంభం

జూలూరు ఉప వైద్య కేంద్రంలో డ్రోన్ సేవలను ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ యశోద

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 6 : ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రిసెర్చ్ ప్రాజెక్టు (ఐసీఎంఆర్) ఆధ్వర్యంలో మండలంలోని జూలూరు హెల్త్ సబ్ సెంటర్‌లో డ్రోన్ సేవలను డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ యశోద గురువారం ప్రారంభించారు. క్షయ వ్యాధి నిర్మూలనలో భాగంగా ఐసీఎంఆర్ ఆధ్వర్యంలో తెమడ శాంపిల్స్‌ను సేకర